క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 21నఉదయం 11 గంటలకు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు మండల గ్రామ స్థాయి అధికారులు అందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

22న శ్రీప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల వేడుకలు ఈనెల 22న హనుమాన్ జయంతి పురస్కరించుకొని గ్రామస్తులు ఘనంగా నిర్వహించుతున్నారు. ఆలయ కమిటీ సభ్యులు సారథ్యంలో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు సోమవారం తెలిపారు. విద్యుత్ ప్రభలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయు వారందరు తప్పనిసరిగా పోలీసు అనుమతులు పొందాలన్నారు.

ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలి



వినుకొండ: మండలంలోని కుమ్మరిపాలెం, తిమ్మాయపాలెం, శ్రీరామనగర్, పానకాలపాలెం, భారతాపురం గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని తహసీల్దార్ సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఈ రోడ్డు సరిగా లేదని ఈ రూట్‌లోని బస్సును శివాపురం, నడిగడ్డ, కొప్పుకొండకు తిప్పడం జరిగిందని, ప్రస్తుతం ఆ రోడ్డును పునరుద్ధరించడం జరిగిందని, మరలా యథాప్రకారం కొప్పుకొండ బస్సును ఈ గ్రామాల మీదుగా తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొంకూరి వెంకటేశ్వర్లు, కె.శివరామకృష్ణ, ఆర్.వెంకటేశ్వర్లు, పి.వెంకటప్పయ్య, తోట చిననాగయ్య, కె.నరసింహారావు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర విజయవంతం చేయాలి

సత్తెనపల్లి: హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 22న పట్టణంలో జరగనున్న హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని నారాయణ సేన నగర సంకీర్తన బృందం పిలుపునిచ్చింది. పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో హనుమాన్ శోభాయాత్రపై సోమవారం నిర్వహించిన సమావేశంలో సంకీర్తన బృందం సభ్యులు మాట్లాడారు. హనుమాన్ శోభాయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నారాయణ సేన నగర సంకీర్తన బృందం సభ్యులు తదితరులు ఉన్నారు.

వీహెచ్‌పీ అమరావతి ఖండ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

అమరావతి: విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) అమరావతి ఖండ అధ్యక్షుడిగా మండల పరిధిలోని మునగోడు గ్రామానికి చెందిన మేకల వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సమరసత విభాగం అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపికృష్ణ నేతృత్వంలో సరస్వతి శిశు విద్యా మందిర్‌లో సోమవారం విశ్వహిందూ పరిషత్ అమరావతి ఖండ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ ఎంపికలో అమరావతి ఖండ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడిగా మేకల వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా మద్ది ఆనంద్, మాత శక్తి ప్రముఖ్‌గా పారేపల్లి పుష్పలత కార్యవర్గ సభ్యులుగా శంకరమంచి శ్రీనివాస్, మల్లాల విశ్వనాథ్, నెప్పలి రామ్ కళ్యాణ్ చక్రవర్తి, నారదాసు నరసింహారావు, మల్లాల భార్గవ్ తేజలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా చిరుమామిళ్ల గోపికృష్ణ మాట్లాడుతూ దేవాలయాల పరిరక్షణ, హిందూ ధర్మ సంరక్షణ కోసం కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోలా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహ ఆవిష్కరణ



అచ్చంపేట: స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితజాతి ముద్దుబిడ్డ.. అనేక సంస్కరణలు చేశారని, ఆయనను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన అడుగుజాడల్లో నడవాలని చెప్పారు. ఆయన వెంట పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు. మండలంలోని తాళ్లచెరువులో బాలయేసు దేవాలయం నిర్మించి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుగుతున్న వజ్రోత్సవ వేడుకలు మూడవరోజు ఉత్సవాలలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఫాదర్ పుట్టి అంతోనిరాజు ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళా కళాకారులకు కాంతిరేఖ కావాలి

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు
- రంగస్థల నటి గుడివాడ లహరికి ఘనసత్కారం



రంగస్థల యువ ఉత్తమనటి సత్కారం అందుకుంటున్న గుడవాడ లహరి

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: కళాకారులు చైతన్యమనే దివిటీతో సమాజాన్ని వెలుగు మార్గంలో నడిపించే దిక్సూచిలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. తెలుగు రంగస్థల పటిష్టతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఉమ్మడి ఆహ్వాన నాటిక పోటీల్లో చివరి రోజు పండుగలా మారింది. చిలకలూరిపేట కళాపరిషత్, సి.ఆర్. క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక నాటికోత్సవానికి వేడుకల్లో చివరిరోజున రంగస్థల, బుల్లితెరలో నటిగా తనదైన ముద్ర వేసిన గుడివాడ లహరికి పరిషత్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథిగా హాజరుకాగా వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు సన్మానకర్తగా వ్యవహరించారు.

ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ, "కళాకారులు సమాజ చైతన్యానికి మార్గదర్శకులు. గుడివాడ లహరి వంటి ప్రతిభావంతులు తననటనైపుణ్యాలతో భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని మహిళా కళకారులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. సన్మానకర్త డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ కళా రంగంలో కాంతిరేఖలా వెలుగొందుతున్న గుడివాడ లహరి బహుముఖ ప్రజ్ఞాశాలిగా నటన ప్రతిభను కనబరుస్తుందని కొనియాడారు. ఆమె నటనలోని లోతు, ఆవేశం, వ్యక్తిత్వంలో ఉన్న మృదుత్వం కళా ప్రపంచంలో కాంతిరేఖ కావాలన్నారు. మహిళా కళాకారులతో సన్నిహితంగా ఉంటూ సమన్వయం చేసుకుంటూ వర్ధమానులను ప్రోత్సహించటం ఆమె వ్యక్తిత్వానికి తార్కాణం అన్నారు. వీరితోపాటు పరిషత్, క్లబ్ ప్రతినిధులు, ప్రముఖులు కళాకారులు వాలు వాలు కప్పి పుష్పగుచ్ఛాలను అందించి కళామతల్లి సేవలో చిరకాలం వర్ధిల్లాలంటూ ఆశీర్వదించారు.

కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షులు చెరుకూరి కాంతయ్య, సి ఆర్ క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, కోశాధికారి మక్కెన నరసింహారావు, ఏవి శివయ్య, కొత్త శివ, షేక్ షఫీ, నాగభైరు బ్రహ్మానందం, అంబటి బాలస్వామి షేక్ జమాల్ బాషా వాళ్ల హరిబాబు ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు .

సమస్యలు పరిష్కరించి గ్రామీణ ఆరోగ్యాన్ని కాపాడండి

- సీహెచ్‌ఓల పోరాటానికి సంఘీభావం తెలిపిన నాయకులు
- 24 నుంచి నిరవధిక సమ్మె చేపడతామంటున్న సీహెచ్‌ఓలు



గాంధీపార్కుకు ఎదురుగా సోమవారం సమ్మెలో పాల్గొన్న సీహెచ్‌ఓలు

నరసరావుపేట: జిల్లాలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)ల సమస్యలను పరిష్కరించి నెలరోజులుగా గ్రామాల్లో కుంటుపడిన గ్రామీణ వైద్యఆరోగ్యసేవలను పునరుద్ధరించాలని పలువురు నాయకులు కోరారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని గాంధీపార్కుకు ఎదురుగా సీహెచ్‌ఓలు చేస్తున్న సమ్మె సోమవారంతో 22వ రోజుకు చేరింది. కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) నాయకులు కె.కృష్ణ, గాంధీ స్మారక సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఈదర గోపీచంద్, న్యాయవాది సింగం హరికాంత్ ధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 24 నుంచి శాంతియుతంగా నిరవధిక సమ్మె చేయనున్నామని పేర్కొన్నారు. తమను వెంటనే చర్చలకు పిలవాలని ప్రభుత్వాన్ని జిల్లా అధ్యక్షులు అనుపమ, సాగర్, రాము, శివ కోరారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



సత్తెనపల్లి: విద్యార్థులు విద్యతోపాటు ఇతర రంగాలపై పట్టు సాధిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని లోక్‌జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న పత్తిపాటి అంకిత్‌పాల్ విజయవాడలోని హలెల్ మ్యూజిక్ ద్వారా సంగీతం నేర్చుకుని 2024 డిసెంబరు 1న 18 దేశాల్లోని 1,046 మందితో స్వరాలు ఆలపించి గిన్నిస్ బుక్ రికార్డు సాధించి ఇటీవల ధ్రువీకరణ పత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అంకిత్‌పాల్‌ను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించిన అంబేడ్కర్, అబ్దుల్ కలాంలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తల్లిదండ్రుల అభిప్రాయాలు పిల్లలపై రుద్దకుండా వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన అంకిత్ పాల్ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం అంకిత్ పాల్‌ను అభినందించి ఘనంగా సన్మానించి మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో నాయకులు మహంకాళి వెంకట్రావు, కొండా బాబు, పత్తిపాటి కిరణ్‌బాబు తదితరులు ఉన్నారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం



నాదెండ్లలో విరిగిపడిన విద్యుత్‌స్తంభం చూపుతున్న ఆలయ కమిటీ సభ్యులు

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల చలమకొండల వద్ద కొలువైయున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానానికి వెళ్ళే మార్గమధ్యలో పదిహేను రోజుల క్రితం విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఆలయ కమిటీ సభ్యులు పలుమార్లు విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేదని వాపోతున్నారు. నాదెండ్ల నుండి దేశమ్మపాడు వెళ్ళే నల్లచెరువు కట్టదారిలో విద్యుత్ స్తంభం కూలింది. అప్పటి నుంచి ఆలయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే ఈ నెల 22న హనుమత్ జయంతి సందర్భంగా ఆలయంలో ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయానికి విద్యుత్ సరఫరా లేకపోవటంతో వేడుకల నిర్వహణ పనులు నిలిచిపోయాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై నాదెండ్ల మండల ఇన్‌చార్జి విద్యుత్ శాఖ ఏఈని వివరణ కోరగా త్వరితగతిన విద్యుత్‌స్తంభం ఏర్పాటు చేసి సరఫరా పునరుద్ధరిస్తామన్నారు. హనుమత్ జయంతి వేడుకలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు.

కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలి



అభివాదం చేస్తున్న నాయకులు

చిలకలూరిపేట: ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన డీఈవో కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపు నిచ్చారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయం వద్ద ఐక్యవేదిక నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపకపోవడం దురదృష్టకరమన్నారు. వివిధ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా డీఈవో కార్యాలయాల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కె.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరెడ్డి, బి.సంపత్‌బాబు, బి.వెంకటేశ్వర్లు, పోటు శ్రీనివాసరావు, షేక్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

దుక్కులకు అనుకూలమైన సమయం

రెంటచింతల: సాగు భూములలో దుక్కులు దున్నుకునేందుకు ఇదే అనుకూలమైన సమయమని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. దుక్కులను వాలుగా లోతుగా దున్నుకోవాలని లేనిఎడల వర్షపు నీటికి భూమి కోతకు గురయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. వాలుకు అడ్డంగా దున్నిన వ్యవసాయ భూమి ఎక్కువ తేమను కలిగే సామర్థ్యం ఉంటుందని వివరించారు. దుక్కులతో అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు.

బంగారం దుకాణంలో ఆభరణాలు చోరీ

- అసలు స్థానంలో నకిలీ వస్తువులు పెట్టి పరారీ
- సీసీ పుటేజ్ ద్వారా ముగ్గురు మహిళా నిందితులు గుర్తింపు
- దుకాణ యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు

నరసరావుపేటటౌన్: బంగారు వస్తువుల కొనుగోలుకు వచ్చిన మహిళలు నకిలీ వస్తువులు పెట్టి అసలైన బంగారం దొంగిలించిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి చరణ్ ఆదివారం తెలిపారు. పట్టణంలోని శివుడిబొమ్మ సెంటర్లో గల శ్రీ శారద జ్యూయలర్స్ దుకాణంలోకి శనివారం ముగ్గురు మహిళలు వచ్చారు. బంగారుచెవి కమ్మలు కావాలని అడిగారు. అవి చూస్తూనే దుకాణ సిబ్బందిని మాటల్లో పెట్టి వారి వెంట తెచ్చుకున్న నకిలీ కమ్మలను అక్కడ పెట్టి అసలైన వాటిని అపహరించారు. సరిపడ డబ్బులు లేవని రేపు వచ్చి తీసుకు వెళ్తామని చెప్పి వెళ్లిపోయారు. బంగారం వస్తువుల తూకంలో వ్యత్యాసం రావటంతో అనుమానం వచ్చిన దుకాణ గుమస్తా యజమాని దృష్టికి తీసుకెళ్లారు.

సీసీ పుటేజ్ పరిశీలించగా ముగ్గురు మహిళలు నంబర్ ప్లేట్ లేని ఆటోలో వచ్చి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు దుకాణ యజమాని కపిలవాయి విజయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ. 1.30 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

రెంటచింతల: నూతన రేషన్(బియ్యం) కార్డులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ దొప్పలపూడి మేరీ కనకం కోరారు. తహసీల్దార్ కార్యాలయలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు 366 మంది కొత్త రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా మరో 323 మంది నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందచేసినట్లు తెలిపారు. ఒంటరి మహిళ, ఆశ్రమాల్లో ఉన్నవారికి కూడా బియ్యం కార్డులు మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. కొత్త రేషన్ కార్డు, బియ్యం కార్డులో కుటుంబ సభ్యుల విభజనకు, కొత్త సభ్యుల చేర్పు, చిరునామా మార్పు కోసం, మృతి చెందిన వారి పేర్లు తొలగింపునకు, బియ్యం కార్డును స్వచ్ఛందంగా వదులుకోవడానికి, రైస్‌కార్డులో ఆధార్ సీడింగ్ తప్పుగా ఉన్నా సరిచేసుకోవడానికి గ్రామాలలోని సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మొదటి విడత పాఠ్యపుస్తకాల పంపిణీకి సిద్ధం



రెంటచింతల: రెంటచింతల మండలానికి మొదటి విడతగా 11,800 టెక్ట్స్‌బుక్స్ వచ్చినట్లు ఎంఈఓ-2 వై.శివ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్, జెడ్పీ, కస్తూరిబా, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు కలుపుకుని మొత్తం 3,480 మంది విద్యార్థులకు పుస్తకాలు అందజేయాల్సి ఉందని చెప్పారు. 2025-2026 విద్యాసంవత్సరం ప్రారంభ సమయానికి రెండో విడతగా మరో 4,700 టెక్ట్స్‌బుక్స్ రావాల్సి ఉందని పేర్కొన్నారు. సకాలంలోనే హెచ్‌ఎంల ద్వారా ఆయా పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



దాచేపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సీఐ పి.భాస్కర్ హెచ్చరించారు. మండలంలోని పొందుగల రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. తెలంగాణ నుంచి ఏపీకి వచ్చే వాహనాలలో సోదాలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమని, తాగి వాహనాలు నడిపి ప్రమాదాలబారిన పడవద్దని సీఐ సూచించారు. వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు అన్ని పత్రాలు ఉండేలా చూసుకోవాలన్నారు. తనిఖీల్లో ఎస్సై జి.పాపారావు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధ్యక్షతన క్రోసూరు మార్కెట్ యార్డులో మినీ మహానాడు కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, నియోజకవర్గ పరిశీలకుడు నల్లపాటి రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో అన్ని విధాలుగా పెదకూరపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి టీడీపీ పాటు పడుతుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గం రాజధాని అమరావతిలో భాగస్వామ్యంగా ఉండడం సంతోషకరమని ఎమ్మెల్యే అన్నారు. ముందుగా ఆపరేషన్ సిందూర్‌లో మన దేశ పోరాటపటిమ, సత్తా చాటిన దేశ సైనికులకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కార్యకర్తలు, నాయకులు వెన్నా సాంబశివరెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కార్యదర్శులు ఆటంకం

ఎంపీపీ సుహాసిని

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన గంటావారిపాలెం నుంచి వేల్పూరు గ్రామం వై జంక్షన్ వరకు నూతన విద్యుత్ లైను ఏర్పాటు చేయడానికి విద్యుత్ అధికారులు అనుమతులు జారీ చేసినా కేవలం పంచాయతీ కార్యదర్శులు ఆలసత్వంతో నేటి వరకు పనులు ప్రారంభించలేదని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని ఆరోపించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుహాసిని విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గంటావారిపాలెం నుంచి వేల్పూరు గ్రామంలో ఉన్ననటువంటి జడ్పీ ఉన్నత పాఠశాలకు పదోతరగతి విద్యార్థులు రాత్రి సమయంలో ఇబ్బందులు పడకుండా ఉండటానికి వారి సౌకర్యం కోసం నూతన విద్యుత్ లైను ఏర్పాటు చేయడానికి రూ.5 లక్షల 50 వేలు అంచనాలు వేసి పంచాయతీ నిధులు కేటాయించటంతో పాటు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారన్నారు. అలాగే విద్యుత్ అధికారుల నుంచి ఈఏడాది మార్చి 24న పనులు చేయటానికి అనుమతులు జారీ చేసినట్లు ఎంపీపీ వెల్లడించారు. ప్రస్తుతం పంచాయతీ నిధులు ఉన్నాయని కేవలం పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం ఆలసత్వం వలన అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తూ కాలయాపన చేస్తున్నట్లు తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. ఈవిషయం గురించి ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్యను వివరణ కోరగా పంచాయతీ నిధులు సిద్ధంగా ఉన్నాయని పనులు త్వరతగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నాటుసారా రహిత గ్రామాలుగా ప్రకటనకు సిఫార్సులు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

బొల్లాపల్లి: ప్రొహిబిషన్ / ఎక్సైజ్ ఈపూరు స్టేషన్ పరిధిలో బొల్లాపల్లి మండలంలో నాటుసారాయి ప్రభావిత గ్రామాలైన బోడిపాలెంతండా, గండిగనుమలలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామకమిటీల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ రెండు గ్రామాలను నాటుసారాయి రహిత గ్రామాలుగా ప్రకటించాలని తీసుకున్న నిర్ణయంపై ఈ సమావేశాల్లో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగాపై గ్రామ కమిటీలు నిరంతరం పర్యవేక్షణ చేయడం, అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం, అవగాహన కార్యక్రమాలు జరపడం, పాత కేసుల్లో ఉన్న వారిని గుర్తించి తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేయడం తదితర కార్యక్రమాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ రెండు గ్రామాల్లో నాటుసారాయి సంబంధిత నేరాలు లేవని నిర్ధారించుకొని సదరు గ్రామాలను నాటుసారాయి రహిత గ్రామాలుగా ప్రకటించేందుకు సిఫార్సులను గ్రామకమిటీలు ఇవ్వడం జరిగిందన్నారు. చట్టవ్యతిరేకంగా పనులు ఏమైనా ఉంటే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆడాప్షన్ ఆఫీసర్లు ఎ. యాకోబు, ఎస్‌కే ఇమామ్ హుస్సేన్, ఆయా గ్రామాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు నేత కామ్రేడ్ పుచ్చలపల్లి

సీపీఎం కార్యాలయంలో ఘనంగా నివాళులు



పుచ్చలపల్లి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నరసరావుపేట: శ్రమ దోపిడీకి గురవతూ అట్టడుగు వర్గాన ఉన్న కార్మికులు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించడంతో పాటు కార్మిక వర్గానికి రాజ్యాధికారం కోసం పాటు పడిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్ అన్నారు. సోమవారం కోటప్పకొండ రోడ్డులోని కార్యాలయంలో పుచ్చలపల్లి 40 వర్ధంతి సభ నరసరావుపేట మండల కార్యదర్శి డి.శివకుమారి అధ్యక్షతన నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ తన జీవిత కాలం మొత్తం పేద ప్రజలు, కార్మికుల హక్కుల కోసం పోరాడాడన్నారు. ఒకటవ, రెండో పట్టణ కార్యదర్శులు సిలార్ మసూద్, సయ్యద్ రబ్బానీ, నాయకులు మెటిల్డాదేవి, ఈపూరి మస్తాన్ రెడ్డి, కట్టా కోటేశ్వరరావు, మస్తాన్‌వలి, సుభాష్ చంద్రబోస్, సమైక్య ఆంధ్రప్రదేశ్ ముస్లిం జేఏసి రాష్ట్ర కన్వీనర్ ఎస్.కె జిలాని మాలిక్ పాల్గొన్నారు.

దేశ రక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివి



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చిలకలూరిపేట: దేశంకోసం ప్రాణాలు అర్పించిన సైనికుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధ సమయంలో కులమతాలకు, పార్టీలకు అతీతంగా దేశం మొత్తం ఒక తాటిపై నిలవడం గర్వకారణమన్నారు. భిన్నత్వంలో ఏకత్వం భారత దేశ గొప్పతనమని కొనియాడారు. దేశసైనికుల స్ఫూర్తిని కొనసాగించాలని వెల్లడించారు.ఈ సందర్భంగా జాతీయ పతాకాలు చేతబట్టి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, జనసేన నియోజకవర్గ కన్వీనర్ తోట రాజా రమేష్, బీజేపీ నాయకులు తాటిపర్తి జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాధా రంగాల స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

చిలకలూరిపేట: వంగవీటి రాధా, రంగాల స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాధారంగ మిత్రమండలి నియోజకవర్గ కన్వీనర్ అచ్చుకోల మురళీకృష్ణ చెప్పారు. పట్టణంలోని రైతు బజారు వెనుక ప్రాంతంలో రాధారంగ మిత్రమండలి కార్యాలయాన్ని సోమవారం బీసీ నాయకుడు కస్తూరి వెంకటేశ్వర్లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన రాధారంగా ప్రజల హృదయాల్లో నిలచిపోయారని తెలిపారు. వారి అడుగు జాడల్లో మిత్రమండలి ఆధ్వర్యంలో కుల మతాలు, పార్టీలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.రాధాకృష్ణ, కాపు నాయకుడు మల్లెల శివనాగేశ్వరరావు, గిరిజన సంఘం అధ్యక్షుడు బి శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు వెంటనే చెల్లించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి రవిబాబు

అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీల వేతనాలను వెంటనే చెల్లించాలని ఈ నెల 20వ తేదీ గ్రామ సచివాలయాలు, మండల కేంద్రాల్లో జరగనున్న నిరసన కార్యక్రమాల్లో ఉపాధి హామీ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవి బాబు కోరారు. సోమవారం మండల పరిధిలోని మునుగోడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు తగ్గించటం వల్ల సకాలంలో వేతనాలు అందకపోవటంతో పాటుగా వేసవిలో మజ్జిగ, మంచినీరు, పలుగు, పార అలవెన్సులు లేకుండా పోయాయన్నారు. పెరిగిన కుటుంబ అవసరాలకు వ్యవసాయ కార్మికులు వారం వారం చెల్లింపులు చెల్లించాల్సి ఉండగా ఆరు వారాలుగా వేతనాలు అందకపోతే ఏ విధంగా కుటుంబాల అవసరాలు తీరతాయన్నారు. మేట్‌ల వ్యవస్థ అమలు కాకపోవటంతో వివిధ పనులకు ఉమ్మడిగా నంబర్లు ఇవ్వటం వల్ల ఒకే చోటికి ఉపాధి హామీ కూలీలు వచ్చి ఆన్‌లైన్ హాజరు పట్టికలో ఫొటోలు తీసుకోవాలంటే గంటల తరబడి జాప్యం జరుగుతుందన్నారు. ప్రభుత్వ మేట్‌ల వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలన్నారు. ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని 20వ తేదీన గ్రామ సచివాలయాలు, మండల కేంద్రాల్లో జరగనున్న నిరసన కార్యక్రమాల్లో కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.